www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 27 జులై 2023

సచివాలయ సిబ్బంది

1000 రోజులు..!

టిటిడి అటవీ కార్మికుల చారిత్రాత్మక పోరాటం / నేడు రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావ నిరసనలు

టిటిడి అటవీ కార్మికులు పెద్దఎత్తున తమ పోరాటాన్ని బలోపేతం చేస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపునిచ్చారు. గురువారం పెద్దఎత్తున ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి విజ్ఞప్తి చేశారు. 2020, నవంబర్ 25న ప్రారంభమైన ఈ దీక్ష గురువారం నాటికి వెయ్యి రోజులకు చేరుకోవడంతో రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు తిరుపతిలో జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొననున్నారు.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ధర్మాన్ని రక్షించండి.. ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది' అని టిటిడి రాసుకున్న ధర్మసూత్రమిది. శ్రీవారి సన్నిధిలో అతి తక్కువ వేతనాలతో మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న టిటిడి అటవీ కార్మికుల సమస్య అటు ప్రభుత్వానికి, ఇటు టిటిడికి పట్టలేదు. 'శ్రీవారూ మీరైనా కనికరించండి.. మీ దగ్గర సేవ చేసుకుంటున్న మాకు అన్యాయం చేయడం ధర్మామా' అంటూ టిటిడి కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను, బోర్డు తీర్మానాలను అమలు చేయాలని శాంతియుతంగా దీక్ష ప్రారంభించి గురువారం నాటికి వెయ్యి రోజులయ్యింది. రాష్ట్రంలోనే ఇది అతిపెద్ద పోరాటంగా చెప్పవచ్చు. టిటిడి అటవీ కార్మికులు 200 మంది మూడు సంవత్సరాలుగా అనేక ఒడిదుడుకులను, ఎండలను, వర్షాలను, చలిలోనూ నిరసన దీక్ష కొనసాగిస్తూనే ఉన్నారు. తమ న్యాయమైన కోర్కెలను టిటిడి యాజమాన్యం పట్టించుకోకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తోంది. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మూడున్నరేళ్ల క్రితం తిరుపతి పర్యటన సందర్భంగా 'మీ హామీ ఇంకా పరిష్కారం కాలేదా' అని స్పందిస్తూ 24 గంటల్లో పరిష్కారం చూపుతామని మరోసారి హామీ ఇచ్చారు. 2019లో స్వయంగా టిటిడి బోర్డులో సైతం తీర్మానం చేశారు. టిటిడి అటవీ కార్మికులు 362 మంది ఉండగా కేవలం 162 మందిని మాత్రమే పర్మినెంట్ చేసి, మిగిలిన వారిని టైంస్కేలు ఇవ్వకుండా టిటిడి కార్పొరేషన్‌లో ఏకపక్షంగా కలిపేసింది. కార్పొరేషన్‌లో కలపొద్దు, టైంస్కేలు కొనసాగించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించినా టిటిడి పెడచెవిన పెట్టింది. అయినవారికి ఆకుల్లో, కానివారికి కంచాల్లో అన్న విధంగా టిటిడి అటవీ కార్మికుల పట్ల వివక్ష పాటించి అధర్మంగా వ్యవహరించింది. ధార్మిక క్షేత్రంలో కార్మికుల పట్ల టిటిడి ధర్మం తప్పుతోంది.

వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఓటర్ల సర్వే బాధ్యత

వ్యతిరేకిస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ఒకటో తేదీ ప్రతి ఇంటికీ వెళ్లి అవ్వా పింఛన్, తాతా పింఛన్ తీసుకోండి' అని వాలంటీర్లతో కలిసి వెళ్లే వెల్ఫేర్ అసిస్టెంట్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నారు. ఓటర్ల సర్వే బాధ్యత తమది కాదని రెవెన్యూ సిబ్బందికి మాత్రమే పరిమితం చేయాలని సచివాలయ సిబ్బంది విన్నవించినప్పటికీ ప్రభుత్వం అంగీకరించడం లేదు. ప్రభుత్వ సంక్షేమాన్ని ఎవరైతే ప్రజల వద్దకు తీసుకెళతారో వారి ద్వారారే ఓటర్ల మార్పులు చేర్పులు, తొలగింపు, ఓట్లు అడిగే బాధ్యతను వెల్ఫేర్ అసిస్టెంట్లు చేయాలని ఖరాఖండిగా ఉన్నతాధికారులు తేల్చి చెబుతున్నారు. దీంతో పని ఒత్తిడి తట్టుకోలేక, ముఖ్యంగా రాజకీయ వత్తిళ్లతో కూడుకున్న ఓటర్ల సర్వే బాధ్యత తమకు వద్దని వెల్ఫేర్ అసిస్టెంట్లు వీధికెక్కారు. దీంతో ఈ అదనపు పనిని తమకు అప్పగించవద్దని జిల్లాలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డిని బుధవారం కలిసి విన్నవించారు.

తిరుపతి జిల్లాలో ప్రతి సచివాలయంలోనూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందజేసే బాధ్యత వెల్ఫేర్ అసిస్టెంట్లది. జిల్లావ్యాప్తంగా 1325 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ప్రభుత్వం తీసుకొస్తున్న అమ్మఒడి, రైతు భరోసా, నేతన్న నేస్తం, పింఛన్లు, చేయూత, వసతి దీవెన, విద్యా కానుక తదితర పథకాలన్నీ వీరి కనుసన్నల్లోనే జరుగుతుంది. ఇవి కాకుండా రోజుకు మహిళా పోలీసులు, ఎఎన్ఎంలు చేయాల్సిన సర్వే బాధ్యతల్లోనూ వీరు ఉంటున్నారు. ఈ బాధ్యతలను అప్పగించినప్పటికీ సచివాలయంలో 150-200 మంది లబ్దిదారులకు అందుబాటులో ఉండి సమాధానం చెబుతూ పర్యవేక్షించాల్సి ఉంది. ఈ పనులే కాకుండా రాజకీయ వత్తిళ్లతో కూడిన బూత్ లెవల్ ఆఫీసర్లుగానూ వీరికి ఓటర్ల సర్వే బాధ్యతను అప్పగించడాన్ని వీరు మూకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది అధికార పార్టీ సేవలు చేస్తున్న నేపథ్యంలో బిఎల్ఒ డ్యూటీలు అప్పగిస్తే ప్రతిపక్షాలు లేవనెత్తినట్లుగా ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఓ వెల్ఫేర్ అధికారి 'ప్రజాశక్తి'తో అన్నారు. ఏదిఏమైనప్పటికీ సంక్షేమాన్ని అర్హులకు పంచే వెల్ఫేర్ ఆఫీసర్లకు తెలివిగా ప్రభుత్వం ఓటర్ల సర్వే బాధ్యతను అప్పగించడం వేధింపుల్లో భాగమేనని వారు వాపోతున్నారు.

'మాస్' దోపిడీ..!

వారికి జీతాలందని నాలుగు నెలలు
కలెక్టర్ ఆఫీసులో పారిశుధ్య కార్మికుల వ్యథ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఎక్కడా లేనంత సుందరమైన భవనం. ప్రభుత్వం జిల్లాల విభజన నేపథ్యంలో తాత్కాలికంగా కొలువుండేందుకు తిరుచానూరులోని టిటిడి నిర్మించిన పద్మావతి నిలయాన్ని అప్పగించారు. దీనికి నెలసరి అద్దె ప్రభుత్వం లక్ష రూపాయలు చెల్లిస్తోంది. జిల్లాలోని శాఖలన్నీ ఒకే గొడుగుకింద ఉన్నట్లుగా ఈ భవనంలో ఉన్నాయి. ఏ శాఖకు చెందిన అధికారి వద్దకు వెళ్లాలన్నా ఆటో అవసరం లేదు. నడవాల్సిన పనిలేదు. లిఫ్ట్ ఎక్కితే చాలు ఆ అధికారి వద్దకు వెళ్లి వారి బాధలను విన్నవించుకోవచ్చు. అలాంటి కలెక్టర్ భవనంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలందడం లేదు. అన్ని కార్యాలయాలను ప్రతిరోజూ అద్దంలా శుభ్రం చేయాలి. అద్దాలను, బల్లలు, కుర్చీలు, ఫ్లోనింగ్ అన్నీ పరిశుభ్రంగా ఉంచాలి. దాదాపు 30 మంది మహర్షి అభ్యుదయ సేవా సమితి (మాస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వీరు పనిచేస్తున్నారు. వీరికి నెలకు ఇచ్చే జీతం పదివేల లోపే. పొద్దంతా పనిచేసినా పూట గడిచే పరిస్థితి లేదు వీరికి. అలాంటి పారిశుధ్య కార్మికులకు ఇచ్చే అరకొర జీతం సైతం నెలనెలా ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది. స్వయానా జిల్లా ఉన్నతాధికారులు ఉన్న చోటనే ఇటువంటి 'వెట్టి'చాకిరీ జరుగుతుండటం గమనార్హం. ఈ విషయమై మాస్ సంస్థ ఇన్‌ఛార్జి 'బాబి'ని 'ప్రజాశక్తి' వివరణ కోరగా బిల్లులు పెట్టామని, ఇంకా సంతకం కాలేదని, త్వరలోనే ఇచ్చేస్తాం అని చెప్పడం శోచనీయం.

కలెక్టరేట్లో ఫ్లోర్ శుభ్రం చేస్తూ...

బిఎల్‌ఎలకు బిఎల్‌ఓలు సహకరించండి : కమిషనర్

తిరుపతి టౌన్ : ఓటర్ల సర్వేకి వెళ్లేటపుడు బూత్ లెవల్ ఆఫీసర్లు తమ వెంట గుర్తింపు పొందిన జాతీయ రాజకీయ పార్టీల తరపున నియమించిన బూత్‌లెవల్ ఏజెంట్లకు (బిఎల్‌ఎలు) సమాచారం ఇచ్చి తమతో తీసుకెళ్లాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం జరిగింది. టిడిపి ప్రతినిధులు మాట్లాడుతూ తమ పార్టీ తరపున పంపించిన బిఎల్‌ఎలకు కొన్ని ప్రాంతాల్లో సర్వేకు బిఎల్ఒలు సహకరించడం లేదని తెలిపారు. దీంతో కమిషనర్ స్పందిస్తూ బిఎల్‌ఎలకు, సూపర్‌వైజర్లకు ఆదేశాలు జారీ చేస్తూ తిరుపతి నియోజకవర్గంలో ఇంటింటికీ జరిగే ఓటర్ల సర్వేకు వెళ్లేటపుడు టిడిపి, వైసిపిల తరపున రెకమెండ్‌చేసిన బిఎల్‌ఎలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఎంఆర్ఒ వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ జీవన్ పాల్గొన్నారు.

బిటిహెచ్ సంస్థతో ఎస్పిఎంవివి అవగాహన ఒప్పందం

క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, స్వీడన్ లోని బ్లేకింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థతో అవగాహనతో కూడిన సహకార ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి. భారతి వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిప్యూటీ డైరెక్టర్ ఇంటర్నేషనల్ అఫైర్స్ ఆధ్వర్యంలో బ్లేకింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బిటిహెచ్) సంస్థతో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ కోర్సులలో అవగాహన ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులకు పరిశోధనల, ప్రాజెక్టుల వర్కుల నిమిత్తం సహాయ సహకారాలు అందించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని, వర్సిటీ ఇంటర్నేషనల్ డీన్ ఆచార్య విజయలక్ష్మి, ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఆచార్య మల్లికార్జునరావు పాల్గొన్నారు.

రైళ్లలో జర్నలిస్టుల రాయితీ పునరుద్ధరించండి: ఎంపి గల్లా

తిరుపతి టౌన్ : రైళ్లలో ప్రయాణించే జర్నలిస్టులకు రాయితీలు కల్పించాలని టిడిపి ఎంపి గల్లా జయదేవ్ పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించారు. కోవిడ్-19 సమయంలో రద్దు చేసిన రాయితీని పునరుద్ధరించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. లోక్‌సభలో రూల్ 377 కింద స్పెషల్ మెన్షన్ ద్వారా ప్రస్తావించారు.

రాగి గ్లాసుతో నీళ్లు.. అరటిఆకులో అన్నం..

- సుబ్బయ్యగారి హోటల్ ప్రత్యేకత
- తిరుపతి పద్మావతీపురంలో ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన కాకినాడ సుబ్బయ్యగారి హోటల్‌ను రాష్ట్ర భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎంఎల్‌ఏ భూమన కరుణారెడ్డి బుధవారం ప్రారంభించారు. స్థానిక పద్మావతిపురంలోని సుబ్బయ్యగారి హోటల్ వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ కాకినాడలో సుబ్బయ్య గారి హోటల్ చాలా ప్రసిద్ధి చెందిందన్నారు. సుబ్బయ్యగారి హోటల్‌కు దాదాపు 68 ఏళ్ల ఘన చరిత్ర ఉందన్నారు. ప్రకాశం జిల్లా నుంచి కాకినాడకు వలస వచ్చిన సుబ్బయ్య 1950లో పది మందితో కలసి కాకినాడలో చిన్న మెస్ ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్లేటు భోజనం కేవలం 50 పైసలకు విక్రయించేవారు. 1955లో ఈ మెస్‌ను 'శ్రీకష్ణ విలాస్' పేరుతో హోటల్‌గా మార్చారు. ఉభయ గోదావరి జిల్లాలోనే ఫేమస్ శాఖాహార హోటల్‌గా పేరొందిందని తెలిపారు. తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాదులో తమ శాఖలను ఏర్పాటు చేశారని, ఇప్పుడు తిరుపతిలో కూడా ఈ హోటల్‌ను ఏర్పాటు చేసి, నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని నగర వాసులకు అందుబాటులోకి తీసుకురావడం అబినందనీయమన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆ హోటల్ డైరెక్టర్లు ఎం.కృష్ణకుమార్, వై.రాజేష్ మాట్లాడుతూ తమ హోటల్‌కు వచ్చే వినియోగదారులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, రాగిగ్లాసులో నీళ్లు, అరిటి ఆకుల్లో బోజనాలను వడ్డిస్తామన్నారు. నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా రుచికరమైన 30 రకాల వంటకాలను అందిస్తామన్నారు. వినియోగదారుడికి స్వీట్లు, పులిహోరా, పుదీనా రైస్, వెజ్ బిర్యానీ వడ్డిస్తారు, బూరెల్లో నెయి వేసి మరీ ఇస్తారు. జీడిపప్పు బూరి, బెల్లం గారెలు, గుత్తి వంకాయ, దొండకాయ, నేతి బూరెలతో పాటు వివిధ రకాల గోదావరి రుచులను ఒకేసారి ఆస్వాదించొచ్చన్నారు. తమ హోటల్‌లో రెస్టారెంట్, స్వీట్స్, బ్యాంకెట్ హాల్, ప్రీమియం రూమ్స్ లభ్యమవుతాయని, తిరుపతి వాసులు, యాత్రికులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి కార్పొరేషన్ మేయరు డాక్టరు శిరీషా, ఎంఎల్‌సి మెండితోక అరుణ్‌కుమార్, డిప్యూటీ మేయరు భూమన అభినయ్‌రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, తుడా విసి హరికృష్ణ, వైఎస్ఎన్.ప్రసాద్, గణపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



సుబ్బయ్యగారి హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి

సైబర్ క్రైమ్ బాధితునికి సకాలంలో న్యాయం

ప్రజాశక్తి తిరుపతి సిటీ

సైబర్ నేరం ద్వారా పోగొట్టుకున్న రూ. 1,56,092 నగదును తిరుపతి సైబర్ క్రైమ్ పోలీసులు వాపెస్ చేయించి బాధితుడికి సకాలంలో న్యాయం చేశారు. జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ కేసును చేదించి, సైబర్ సెల్ సీఐ రామచంద్ర రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా, ఎస్ .వి .యూ క్యాంపస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని, న్యూ బాలాజీ కాలనీకి చెందిన డాక్టర్ సి .రమేష్ తన యూనియన్ బ్యాంకు అకౌంట్ నుంచి గత నెల 30 వ తేదీ, అతని మొబైల్ కు తన ఖాతా నుండి 17,500రూపాయలు లావాదేవీ జరిగినట్టు మెసేజ్ వచ్చింది. అతను వెంటనేవెళ్లి తన ఖాతాను చెక్ చేసుకుంటే తన బ్యాంక్ అకౌంట్ నుండి మొత్తం 1,56,092/- రూపాయలు పోయినట్లుగా గుర్తించాడు. వెంటనే అప్రమత్తమైన బాధితుడు తిరుపతి సైబర్ క్రైమ్ లాబ్ ఆఫీస్ కు వెళ్లి ఫిర్యాదు చేశారు. సైబర్ ల్యాబ్ ఇన్స్పెక్టర్ రామచంద్ర రెడ్డి అధ్వర్యంలో ఉన్న సైబర్ క్రైమ్ నిపుణులు రంగంలోకి దిగి, ఫిర్యాదుదారుని బ్యాంకు అకౌంట్ స్టేట్మెంట్ వివరాలను(ఫ్రాడ్ ట్రాన్సాక్షన్స్ డీటెయిల్స్) తీసుకొని ఆ ట్రాన్సాక్షన్స్ అన్ని కూడా పి ఓ ఎస్ (పాయింట్ అఫ్ సేల్) ట్రాన్సక్షన్ నుండి అమెజాన్ వాలెట్ కి వెళ్లినట్లుగా గుర్తించి, ఎన్ సి ఆర్ పి పోర్టల్ లో ఫిర్యాదును అప్లోడ్ చేశారు. తరువాత వెంటనే అమెజాన్ నోడల్ అధికారులతో మాట్లాడి మోసపూరిత నగదును స్తంభింప చేశారు. పోలీసులు తిరిగి బ్యాంక్ ఖాతాకు జమచేశారు .

తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

'కాండ్ర' భూములకు పరిష్కారం చూపాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం నిరసన

ప్రజాశక్తి - ఓజిలి

కాండ్ర గ్రామ ప్రజలు రెండు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పరిష్కార మార్గం చూపి పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఓజిలి తాహసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఓజిలి మండలంలోని వీర్లగునపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 1 నుంచి 30 వరకు 150 ఎకరాల ప్రభుత్వ భూమి కలిగి ఉందన్నారు. ఈ భూమిని గత 20 సంవత్సరాలుగా గూడూరు మండలం కాండ్ర గ్రామానికి చెందిన ఎస్సీ ,ఎస్టీలు ,బీసీలు చెట్లు పుట్టలు తొలగించి నిమ్మ చెట్లు సాగు చేసుకుంటున్నారు. అయితే వీరు సాగు చేస్తున్న భూముల్లో పెత్తందారులు ప్రవేశించి నిమ్మ చెట్లను తొలగించి బెదిరింపులకు పాల్పడటాన్ని కలెక్టర్ వెంకట రమణారెడ్డి దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. కలెక్టర్ స్పందించి ఓజిలి తాహసిల్దార్ శివరామ సుబ్బయ్యకు ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారిపై పూర్తి సమాచారం నివేదిక పంపించాలని ఆదేశించారు. తాహసిల్దార్ శివరామ సుబ్బయ్యను కలిసి భూ సమస్యలపై వందవాసి వివరించారు. తాహసిల్దార్ శివరామ సుబ్బయ్య మాట్లాడుతూ నోటీసులు అందించి గ్రామ సభ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి డిప్యూటీ తాహసిల్దార్ సాయి ప్రియాంకకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి శివకవి ముకుంద, గూడూరు సిపిఎం పట్టణ కార్యదర్శి జోగి శివయ్య , కె.విపిఎస్ నాయకులు ప్రసాద్ , కాండ్ర గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎండికండ్రిగ గ్రామానికి రోడ్డు వేయాలి

బుధవారం వెంకటగిరి మండలం చిన్నన్నపేట పంచాయితీ ఎండి కండ్రిగ గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు నేతృత్వంలో జనరల్ బాడీ సమావేశం గ్రామస్థులతో జరిగింది. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ యాతలూరుకి వెళ్లే రైల్వే గేట్ దగ్గర నుండి ఎం.డి కండ్రిగ గ్రామానికి రోడ్డు సరిగా లేదని అన్నారు. వర్షాకాలం గ్రామానికి వాహనాలు వెళ్లే పరిస్థితి లేదన్నారు. వెంటనే రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. గత నలభై ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని గ్రామస్తులు కోరారు. సెంటు భూమి కూడా లేని పేదలు ఉన్నారని, వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, బంగారుపేట కార్యదర్శి చంద్రశేఖర్, గణేష్ పాల్గొన్నారు.

రేర్ ఎర్త్ అప్లికేషన్స్‌తో క్యాన్సర్ మూలాలకు చెక్

క్యాంపస్ : రేర్ ఎర్త్ అప్లికేషన్స్ ద్వారా క్యాన్సర్ మూలాలను గుర్తించి నివారించవచ్చని ఆర్ఈఏఐ సెక్రటరీ సీఎస్ఐఆర్ పూర్వపు చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎంఎల్ పి రెడ్డి పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్ర విభాగం, రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో ఒక్కరోజు వర్క్ షాప్ ని బుధవారం సావేరి అతిధి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేర్ ఎర్త్ సైన్స్ టెక్నాలజీ ద్వారా మానవుని శరీరంలోని క్యాన్సర్ కణాలను నిర్ధారించి వివిధ ఎక్స్ రే కిరణాలను అందించడం ద్వారా నివారించవచ్చని వివరించారు. విద్యార్థులు రేర్ ఎర్త్ సైన్స్ లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని అవగాహన చేసుకుని పరిశోధన పరంగా ముందుకు సాగాలని సూచించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి. భారతి మాట్లాడుతూ విద్యార్థులు భౌతిక శాస్త్రంలోని సైన్స్ యొక్క టెక్నాలజీని క్షుణ్ణంగా ఔపోషణ పట్టి, పరిశోధనాపరంగా ముందుకు సాగాలని సూచించారు. ఆర్ఈఏఐ ఉపాధ్యక్షులు ఆచార్య సికే. జయశంకర్ మాట్లాడుతూ రేర్ఎర్త్ టెక్నాలజీ ప్రస్తుత కాలంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, భౌతిక శాస్త్రంలో రేర్ ఎర్త్ పరిశోధనలు మానవాళికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఈఏఐ వర్క్‌షాప్ కన్వీనర్ ఆచార్య బి. దేవప్రసాద్ రాజు, వర్క్ షాప్ కోఆర్డినేటర్ ఆచార్య యం. కష్ణయ్య, భౌతిక శాస్త్రం విభాగాధిపతి ఆచార్య ఎ. శ్రీదేవి, ఆచార్య కె. సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిభద్రతలు నెలకొల్పాలి

మానవహారాలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు

ప్రజాశక్తి - సత్యవేడు, యంత్రాంగం

మణిపూర్ మారణహోమం మోడీ పాపమేనని సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మూడు నెలలుగా అల్లర్లు జరుగుతున్నా శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తూ అల్లర్లకు ఆజ్యం పోసాయన్నారు. బిజెపి ఎంఎల్ఏలే స్వయంగా అక్కడి విషయాలు చెబుతుంటే ఎంతటి దారుణమైన పరిస్థితి ఉందో అర్థమవుతుందన్నారు. వెంటనే మణిపూర్‌లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని, సిఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంతమ్మ, అనురాధ, భారతి, ఝాన్సీ, నాగరాజు, మంజుల, విజయ, భువన, చందామురై, తిరుమలరెడ్డి, శేఖర్, మునస్వామి, కుమార్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వెంకటగిరిలో... రైతుకూలి సంఘం, స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. రాష్ట్ర నాయకులు వివి రమణయ్య, కె.అజిత మాట్లాడుతూ మణిపూర్ మహిళలపై అమానవీయ దౌర్జన్యాలకు కారకులైన అందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆదివాసి మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మౌనాన్ని వీడి గిరిజనుల రక్షణకు పూనుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.క్రిష్ణారెడ్డి, సిహెచ్ చిన్నఓబయ్య, ఎన్.ఝాన్సీ, రిషిత, బి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో...

గూడూరు టౌన్ : సిపిఎం నాయకులు జోగి శివకుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ వద్ద కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. గోపినాథ్, కోటేశ్వరరావు, సురేష్, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య, మహేంద్ర, రాఘవయ్య పాల్గొన్నారు.

తిరుపతి టౌన్ : మణిపూర్ బాధితుల సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మల్లారపు నాగార్జున, టెంకాయల దామోదరం, ఒ.వెంకటరమణ, సాయిలక్ష్మి, జయంతి, కిరణ్‌కుమారి, డాక్టర్ కడివేటి మునిరత్నం, శ్యాంబోల్ హరినాథ్ బాలాజీ, నడ్డి నారాయణ, సుంకర రెడ్డెప్ప సాకం నాగరాజు, నెమలేటి కిట్టన్న, ప్రసాద్‌రావు, ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో... సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో యుటిఎఫ్, జెవివి ప్రజాసంఘాలు ఏకమై మణిపూర్ మారణహోమాన్ని ఆపాలని నినదించారు. సిఐటియు కార్యాలయం నుంచి బజారు వీధి వరకూ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణలో మానవహారాన్ని నిర్వహించారు. మణిపూర్‌లో మహిళలను అమానుషంగా చంపిన వైనం 73 రోజుల తరువాత బయటకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సుంకర అల్లెయ్య, మేకల హైమావతి, రమణయ్య, లక్ష్మయ్య, బి.పద్మనాభయ్య, సాంబశివయ్య, చంద్రశేఖర్, రాజశేఖర్, మునెయ్య పాల్గొన్నారు.

సత్యవేడులో...

గూడూరులో...

తిరుపతిలో...

ముగిసిన మెడికల్ క్యాంపు

మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజలు పూర్తిస్థాయి ఆరోగ్య వంతులుగా ఉండాలనే ఉద్దేశ్యంతో నియోజక వర్గ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి 42 రకాల వైద్య పరీక్షలతో కూడిన మెడికల్ క్యాంపును నిర్వహించడం జరిగిందని పంచాయతీ బాధ్యులు గుండ్రాజ శివశంకర్ రాజు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా జరిగిన ఈ ఉచిత మెడికల్ క్యాంపు బుధవారంతో ముగిసిందని, ఈ క్యాంపులో 1753 మంది పంచాయతీ ప్రజలు వైద్య సేవలు పొందారని అన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే ఇటువంటి ఆలోచన చేయలేదని, కరోనా సమయంలో నియోజకవర్గ ప్రజలను కుటుంబ సభ్యులుగా భావించి ఉచితంగా ఆనందయ్య మందు, శరీరంలో రోగనిరోధక శక్తి పెంపొందించడానికి గుడ్లు, టానిక్ వంటి వాటిని ఎమ్మెల్యే అందించారని చెప్పారు. తిరుమల నగర్ పంచాయతీ ప్రజలకు మంచి కార్యక్రమాన్ని అందించినందుకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోను కలిసిన జూలియన్ రాజు

రంగనాథ్‌కు అంబేద్కర్ చిత్రపటాన్ని అందిస్తున్న జూలియన్ రాజు

ప్రజాశక్తి-రేణిగుంట: మండల క్లస్టర్ 2 ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన రంగనాథ్‌ని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా మండలం పరిధిలోని పేద విద్యార్థులకు ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాల్ని ఎంఈవోకు జూలియన్ రాజు వివరించారు. ఆషా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తామని ఎంఈఓ తెలిపారు.

అటవీ కార్మికులకు న్యాయం చేయాలి

టీటీడీ కార్మికులకు మద్దతుగా కరపత్రాలతో అంగన్‌వాడీ వర్కర్స్

ప్రజాశక్తి-నాయుడుపేట: టీటీడీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రిలే దీక్షలు చేస్తున్నారు. బుధవారం వీరికి మద్దతుగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి శ్యామలమ్మ మాట్లాడుతూ టీటీడీలో అటవీ కార్మికులుగా గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, అయితే వారిని అకారణంగా విధుల నుండి తొలగించడం అన్యాయం అని అన్నారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేను అధికారంలోకి వస్తే మూడు నెలల్లో అటవీ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని చెప్పి, నేడు మాట తప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ నెల 27వ తేదీ నాటికి రిలే దీక్షలు 1000 రోజులు పూర్తి అవుతున్న సందర్భం గా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపా రు. శాంతమ్మ, వరమ్మ, వనిత, రత్నమ్మ, సుందరమ్మ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం విశ్వవిద్యాలయ ఉనికికి ప్రమాదం

వర్సిటీ ఉపకులపతికి వినతిపత్రం అందిస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 800 మీటర్ల సిసి రోడ్ల నిర్మాణం వర్సిటీ ఉనికికే ప్రమాదకరమని, పర్యావరణానికి పూర్తిస్థాయిలో తూట్లు పొడిచినట్లు అవుతుందని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రామకృష్ణ నాయుడు తీవ్రంగా ఆక్షేపించారు. బుధవారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే.రాజారెడ్డికి టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని విశ్వవిద్యాలయంలో జాతీయ పక్షి నెమలి, అడవి కోళ్ళు, తదితర వన్య పక్షులు, అనేక రకాల వక్ష సంపదలు, వైల్డ్ అనిమల్స్, జింకలు తదితరాలు ఈ ప్రాంతంలో సంచరిస్తూ ఉంటాయని అన్నారు. ఈ రహదారుల నిర్మాణంతో విశ్వవిద్యాలయం వాతావరణం కలుషితమై ఆ వన్య సంపద దెబ్బ తినే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చంద్రగిరి నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు, బిసన్న, శ్రీరామ్, హరీష్, రాజేష్, బషీర్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాల పేట మండలం శ్రీ బొమ్మరాజు పురం గ్రామంలో ఆస్టర్ నారాయణాద్రి, వాసన్ కంటి, హియర్ ఇన్‌స్ట్రుమెంట్ ఆసుపత్రి వారిచే గ్రామ సర్పంచ్ మణి రాజు, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోనేటి రవిరాజు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉప సర్పంచ్ రవి పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించిన వైద్యులను, సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఎస్‌బిఆర్ పురం గ్రామంలో సుమారుగా 350 మంది రోగులకు కంటి పరీక్షలు, ఇసిజి, షుగర్, బిపి, కొలెస్ట్రాల్ వంటి వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవి, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోనేటి రవి రాజు, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వైద్యులు పూర్ణచంద్రరావు, పిఆర్ఓ వెంకటేష్, మనోజ్ కుమార్, హేమావతి తదితరులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణపై నిరసన

నిరసన తెలుపుతున్న వెంకటరెడ్డి పల్లి గ్రామస్తులు

ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని వెంకటరెడ్డి పల్లి గ్రామం లోపలికి వెళ్లే దారి ఆక్రమణకు గురవ్వడంతో బుధవారం గ్రామస్తులు తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మీసేవ పక్కనే ఉన్న వెంకటరెడ్డి పల్లి, వడ్డీ పాలెంకు వచ్చే రహదారిని వల్లిపు బ్రహ్మయ్య ఆక్రమించారని తెలిపారు. ఈ దారి ఆక్రమణ చేపడితే వ్యవసాయ పొలంలోకి, నిత్యావసరాలకు పనులకు వెళ్లేందుకు దారి లేకుండా అవస్థలు పడక తప్పదని చెప్పారు. గత నెలలో ఆక్రమిస్తే రెవెన్యూ సిబ్బంది వచ్చి ఆక్రమణల్ని తొలగించారు. మళ్ళీ గత మంగళవారం జెసిబి సహాయంతో దారికి అడ్డంగా ముళ్ళ కంపను ఎవరూ రాకుండా అడ్డంగా వేశారని తెలిపారు. దీంతో వ్యవసాయ పొలంలోకి వెళ్లే పశువులు, నిత్యవసరాలకు వెళ్లే ప్రజలు చాలా ఇబ్బందుల పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

దారులు ఆక్రమిస్తే ఊరుకోం

వెంకటరెడ్డి పల్లి గ్రామస్తులు తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేయడంతో వెంటనే స్పందించిన తహాశీల్దార్ శ్రీనివాసులు స్పందించి గ్రామంలోకి వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దారి ఆక్రమణ చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని, గ్రామాలలోకి వచ్చే దారులను ఎలా ఆక్రమిస్తారని, ఇలా చేయడం పద్ధతి కాదని, మరొకసారి ఇలా చేస్తే ఆక్రమించిన వారిపై కేసులు పెట్టక తప్పదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్ఐ పూర్ణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కేవీబీపురం: గ్రామస్తులు తెలిపిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. బుధవారం మండలంలోని ఎంఎ రాజుల కండ్రిగ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేవా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముని లక్ష్మీ నందకుమార్, రాష్ట్ర హిస్టరీ అకాడమిక్ డైరెక్టర్ గవర్ల కష్ణయ్య, జడ్పిటిసి మూర్తి, మునెమ్మ, సుబ్బయ్య, వైస్ ఎంపీపీ దేరాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

పురోగతి లేని సమీక్షలు ఎందుకు?

ప్రజాశక్తి-సత్యవేడు: మండలంలోని పలు ప్రభుత్వ భవన నిర్మాణాలు నత్తనడకే నయమనిపించేలా కొనసాగుతున్నాయి. భవన నిర్మాణాలపై తరచూ అధికారులు సమీక్షలు జరుపుతున్నా పురోగతి నామమాత్రంగా ఉంటుంది. ఇందులో భాగంగానే బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ముఖ్యంగా మండలంలో ప్రస్తుతం కొనసాగుతున్న సచివాలయ భవన నిర్మాణాలు, పక్కా గహ నిర్మాణాలు, హెల్త్ సెంటర్లు, గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంజూరైన పనులు, నాడు-నేడు రెండవ విడతలో మంజూరైన పనుల పురోగతిపై ఎంపీడీవో చంద్రశేఖర్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్, ఎంఈవో రవి, హౌసింగ్ ఏఈ వెంకటసుబ్బయ్యలు సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు హాజరయ్యారు. అయితే పక్కా గృహ నిర్మాణానికి సంబంధించి పలు జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు నత్త నడకన సాగుతున్నాయని, దీంతోపాటు సచివాలయ భవన నిర్మాణాలు మండలంలో నాలుగైదు మినహా మిగిలిన నిర్మాణాలన్నీ ప్రస్తుతం పెండింగ్లోపడ్డాయని పలువురు వాపోతున్నారు. కన్నవరం గ్రామంలో సచివాలయ భవన నిర్మాణం పునాదులకే పరిమితమైతే,దాసుకుప్పంలో గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి చేసుకొని ఏడాది పూర్తయిన మొదటి అంతస్తు ప్రారంభం కానీ పరిస్థితి ఎదురైందని అలాగే హెల్త్ సెంటర్ నిర్మాణాలు కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అని చందాగా మారిందని వారు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమీక్షతోపాటు క్షేత్రస్థాయిలో పరిస్థితి అంచనా వేసి భవన నిర్మాణాలు పూర్తి అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తడ పంచాయతీని సందర్శించిన డీపీఓ

డీపీఓకు శాలువా కప్పి స్వాగతం పలుకుతున్న సర్పంచ్

ప్రజాశక్తి-తడ: జిల్లా పంచాయతీ అధికారి ఏ.రాజశేఖర రెడ్డి బుధవారం తడ పంచాయతీ కార్యాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కే.ఆర్ముగం, డీపీఓకు శాలువా కప్పి స్వాగతం పలికారు. కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం డీపీఓ సిబ్బందితో మాట్లాడారు. రానున్నది వర్షాకాలం కాబట్టి పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. పంచాయతీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

30న అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రసిద్ధి గాంచిన అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్ బ్రాంచిని ఈ నెల 30వ తేది ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతి నగరంలో ప్రారంభించనున్నట్లు సిఈవో డాక్టరు రమేష్‌చంద్ర తెలిపారు. స్థానిక ఎయిర్‌బైపాస్ రోడ్డులోని రాస్ బిల్డింగ్ ఎదురుగా జయశంకర్ నగర్‌లో ఏర్పాటు చేయనున్న ఆ ఆసుపత్రి వద్ద 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ నంద్యాలలో శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో తాను 18 సంవత్సరాల అనుభవంతో ఒక లక్ష కంటే ఎక్కువ క్యాటరాక్ట్ సర్జరీలు నిర్వహించామని, తన బెల్ట్ కింద 99.9 శాతం సక్సెస్ రేట్ తో తన వైద్యుల బందంతో కలిసి, చాలా మంది జీవితాల్లో వెలుగులు నింపాము. మేనేజరు ఈశ్వర్ ప్రసాద్ మాట్లా డుతూ డాక్టర్ రమేష్ చంద్ర తన ప్రారంభ దశల నుండి అగ్ర ర్యాంకర్, అతను ఎస్ఎస్‌సి పరీక్షల్లో స్టేట్ ర్యాంకర్, తర్వాత అతని ఎంబిబిఎస్, ఎంఎస్ ఆప్తాల్మాలజీ రెండింటిలోనూ మెరిట్‌సీట్లను పొందారు. తరువాత, అతను ప్రపంచంలోని ఉత్తమ ప్రఖ్యాత కంటి ఆసుపత్రులు, అగర్వాల్ ఐ హాస్పిటల్ నుండి తన ఫెలోషిప్‌ను ముగించాడని తెలిపారు.

ఉత్తమ నేత్ర వైద్యునిగా గుర్తింపు

డాక్టర్ రమేష్ చంద్ర సంతిరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఎంచుకున్నాడు, ఇది కర్నూలు జిల్లా నంద్యాలలో ఉన్న మెడికల్ కాలేజీకి చెందింది. దీన్ని తన స్థావరంగా ఎంచుకున్నాడు. నేత్ర వైద్య విభాగానికి నేతత్వం వహిస్తూ, తన సమర్థ నాయకత్వంలో, డాక్టర్ రమేష్ చంద్ర భారతదేశంలోని అత్యుత్తమ ప్రఖ్యాత కంటి ఆసుపత్రిలో అందించే అత్యుత్తమ సంరక్షణను భారతదేశంలోని అత్యంత అధునాతన కంటి ఆసుపత్రులలో ఒకటిగా మార్చారు. గత 10 సంవత్సరాలలో, డాక్టర్ రమేష్ చంద్ర తన మరో నలుగురు వైద్యుల బందంతో కలిసి 99.95 శాతం అద్భుతమైన విజయవంతమైన రేటుతో ఒక లక్ష శస్త్ర చికిత్సలను ఉచితంగా చేశారు. తన నిస్వార్థ సేవలకు గానూ, డాక్టర్ రమేష్‌ను ప్రభుత్వం 5 సార్లు ఉత్తమ నేత్ర వైద్య నిపుణుడిగా సత్కరించింది. అతను రోటరీ క్లబ్, ఇంటర్నేషనల్ రోటరీ, లయన్స్ క్లబ్, అనేక ఇతర స్థానిక వంటి అనేక ఇతర ప్రసిద్ధ సంస్థలచే కూడా సత్కరించబడ్డాడు. అమెరికన్ ఐ హాస్పిటల్స్ భారతదేశంలో అత్యుత్తమ కంటి ఆసుపత్రులు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రతి రోగికి నిజాయితీ, గౌరవం, వారి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్స చేయడం ద్వారా, అమెరికన్ ఐ హాస్పిటల్స్ కూడా ఈ ప్రాంతంలో ప్రపంచ స్థాయి బోధనను ప్రోత్సహించడానికి, సులభతరం చేయడానికి విద్య, పరిశోధన కార్యక్రమాలకు దోహదం చేస్తుంది. అమెరికన్ ఐ హాస్పిటల్ ఉదాహరణను అనుసరించి, రోగులందరి అంచనాలను అందుకోవడానికి, అత్యధిక వైద్య ప్రమాణాలకు అనుగుణంగా చేస్తోంది. అధిక అర్హత కలిగి, అనుభవజ్ఞులైన నేత్ర వైద్యులతో, సరికొత్త శాస్త్రసాంకేతిక వైద్య పరికరాలతో అత్యాధునికమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ నెల 30వ తేదిన తిరుపతిలో ప్రారంభమయ్యే అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొలిటికల్ సైన్స్‌తో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని 2023-24 విద్యాసంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఏపీ పీజీ సెట్ 2023 లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అర్థశాస్త్రంలో ఉన్నతమైన అవకాశాలు ఉంటాయని విభాగాధిపతి ఆచార్య బివి.మురళీధర్ బుధవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ పీజీ సెట్ 2023 లో పొలిటికల్ సైన్స్‌లో ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అన్ని రకాల సదుపాయాలతో పాటు ఉన్నతమైన ఉపాధి అవకాశాలు ఉంటాయని వెల్లడించారు. ఎస్వీయూలోని పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో విద్యార్థులకు రెగ్యులర్ కోర్సులో 40 సీట్లు, మేనేజ్మెంట్ కోటాలో ఆరు సీట్లు ఉంటాయన్నారు. విద్యార్థులకు ప్రత్యేకమైన తరగతి గదులు, డిజిటల్ తరగతి గదుల సౌకర్యంతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రంథాలయంలో పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి ప్రత్యేకమైన అర కలిగిన పుస్తకాలు ఉన్నాయని చెప్పారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే యుజిసి నెట్, రాష్ట్రస్థాయిలోనే స్లేట్, సివిల్ సర్వీస్ పరీక్షలు ఐఆర్ఎస్, వంటి సంస్థలలోని వివిధ ఉద్యోగాలకు పొలిటికల్ సైన్స్ ప్రామాణికం అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే గ్రూప్ 1 నోటిఫికేషన్, గ్రూప్ 2, గ్రూప్ 3, సచివాలయం ఉద్యోగాలు, ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్, ఇతర పోటీ పరీక్షలలో పొలిటికల్ సైన్స్ ప్రధాన భాగంగా ఉంటుందని వివరించారు. పొలిటికల్ సైన్స్ లో పీజీ కోర్సు చేసిన తర్వాత విద్యార్థులకు పీజీ, డిగ్రీ, ఇంటర్, న్యాయవిద్య కళాశాలలో పొలిటికల్ సైన్స్ బోధించడానికి మంచి అవకాశాలుంటాయన్నారు. విదేశాలలో కూడా ఎన్నో విశ్వవిద్యాలయాలు ఆర్థిక శాస్త్రం పీజీ చేసిన విద్యార్థులకు ఎన్నో ఉన్నతమైన అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. ఎస్వీయూలోని పొలిటికల్ సైన్స్‌లో పీజీ కోర్సు చేసిన విద్యార్థులకు రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఎక్కడైనా ఉపాధి అవకాశాలు ఉన్నాయని సూచించారు.

నేడు బహిరంగ వేలం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలో ఆగస్టు 10 నుండి 28వ తేదీ వరకు శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి తిరునాళ్లు జరుగుతాయని ఆలయ ఛైర్మన్ మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా 18 రోజులు పాటు తోపు ఆవరణంలో తాత్కాలిక అంగళ్లు నిర్వహణ, వినోద కార్యక్రమాలు జరిపించుకోవడానికి కావలసిన స్థలానికి గురువారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి గల వారు ధరావతు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో-2

ప్రజాశక్తి-ఏర్పేడు: ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని ఏర్పేడు ఎంఈవో-2 దయాకర్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల సముదాయ సమావేశాలను సందర్శించి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతికతో, మెరుగైన విద్యా బోధనతో పాటు విద్యార్థికి పఠనా శక్తిని పెంపొందించాలి అని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ ప్రధానోపాధ్యాయులు సునీత, బండారుపల్లి, పల్లం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్మల్ కుమార్, ఆనంద్, తెలుగు విషయ నిపుణులు గుర్రప్ప, డాక్టర్ దేవరాజులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి

అకాల వర్షలతో దెబ్బతిన్న వరి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షంతో మండలంలోని భవాని శంకరాపురం గ్రామంలో సుమారు 150 ఎకరాల్లోని వరి పంట నీట మునిగి పూర్తిగా దెబ్బతిందని, కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోవడంతో మొలకలు వస్తున్నాయని, చేతికి అందివచ్చిన వరి పంట భారీ వర్షానికి దెబ్బ తినడంతో రైతులు ప్రసాద్ నాయుడు, రమేష్, బాబు, మహేష్ నాయుడు, సుబ్రహ్మణ్యం, మనీ, బత్తయ్య తదితర రైతులు లబోదిబోమంటున్నారు. అప్పులు చేసి పెట్టిన వరి పంట దెబ్బతినటంతో ప్రభుత్వం స్పందించి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఏమి న్యాయం చేశాడో చెప్పాలి

విలేకరుల సమావేశంలో పాల్గొన్న జనసైనికులు

ప్రజాశక్తి-వెంకటగిరి: బీసీ నాయకుడైన గృహనిర్మాణ శాఖ మంత్రి బీసీలకు ఏమి న్యాయం చేశాడో చెప్పాలని, అమరావతిలో కనీసం బీసీ కమిటీ భవనం కూడా నిర్మించలేని వ్యక్తి పవన్ కళ్యాణ్‌ను దూషించడం తగదని జనసేన పట్టణ అధ్యక్షుడు రామారావు అనిల్ అన్నారు. బుధవారం మంత్రి రమేష్ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై చేసిన వాక్యాలను ఆ పార్టీ కార్యాలయంలో ఆయన ఖండించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా విభాగం వీర మహిళ చాముండి రాధమ్మ, వెంకటరమణ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీతోనే శ్రీకాళహస్తి నియోజకవర్గం అభివద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏర్పేడు మండలం జంగాలపల్లి గ్రామ పంచాయతీలో ఆయన పర్యటించారు. టిడిపి మినీ మేనిఫెస్టోను ఆయన ప్రజల్లోకి తీసుకెళ్లారు. మహిళలు, రైతులు, యువకుల కోసం చంద్రబాబు చేపట్టబోయే పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని ఆయన కోరారు. డాక్టర్ పొన్నారావు, గురువారెడ్డి, ధనుంజయ నాయుడు, శివ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మినీ మేనిఫెస్టోను వివరిస్తున్న సుధీర్ రెడ్డి

తమిళ స్మగ్లర్లు అరెస్ట్

పట్టుకున్న నిందితులు, ఎర్రచందనం దుంగలతో పోలీసులు

ప్రజాశక్తి, చిన్నగొట్టిగల్లు: కారులో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు తమిళ స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు భాకరాపేట సీఐ తులసిరామ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుధవారం భాకరాపేట సమీపం నెమలిగుండ్ల క్రాస్ వద్ద సీఐ తన సిబ్బందితో దాడిచేసి కారులో అక్రమ రవాణా చేస్తున్న రూ.3,48,000 విలువ చేసే 58 కేజీల బరువు గల నాలుగు ఎర్రచందనం దుంగలు, రూ.10 లక్షల విలువ గల కారును స్వాధీనం చేసుకొని తమిళనాడుకు చెందిన అశోక్(21), వెంగదేశన్(39)ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. ఈ దాడిలో భాకరాపేట, యర్రావారిపాళెం ఎస్సైలు ప్రకాష్ కుమార్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు గురుస్వామి, లక్ష్మీ ప్రసాద్ రాజు, ప్రసాద్, చరణ్ కుమార్, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పట్టుకున్న ట్రాక్టర్లు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, కాటూరు, అల్లమాల గ్రామాలలోని కాలంగి నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను తహశీల్దార్ భార్గవి ఆదేశాలతో వీఆర్వో భాస్కర్, తేజాలు బుధవారం పట్టుకుని తహశీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని కాలంగి నదిలో ఇసుక రీచ్‌లు లేవని, కాలంగి నది ఇసుకను అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ ప నులు, ఇంటి అవసరాలకు ఏఈల పర్మిషన్ తీసుకోవాలన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు.

గాలి మునిలక్ష్మమ్మకు నివాళులు

గాలి లక్ష్మమ్మకు నివాళులు అర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణ టీడీపీ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు మాతమూర్తి గాలి మునిలక్ష్మమ్మ కర్మక్రియల సందర్భంగా బుధవారం ఆమె చిత్రపటానికి తెలుగుదేశం శ్రేణులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు చెన్నూరు సుధాకర్ బాబు, పుత్తూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ భీమినేని చిట్టిబాబు, చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, అధికార ప్రతినిధి చినబాబు, పుత్తూరు మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్ తదితరులు నివాళులు అర్పించారు.

పాఠ్య పుస్తకాలు అందజేయాలి

ప్రజాశక్తి-క్యాంపస్: ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేయాలని కోరు తూ తిరుపతి జిల్లా ఆర్ఐఓ జివి ప్రభాకర్ రెడ్డికి ఆర్ ఎస్ఎ, టీఆర్ఎస్ఎఫ్ నేతలు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు బందెల ఓబులేసు, ఇండ్ల జయరాజులు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు 2 నెలలు అవుతు న్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత పాఠపుస్తకాలు అందజేయకపోవ డం చాలా దారుణమని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రూ.63 కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మున్సిపాలిటీని రూ.63 కోట్లతో అభివద్ధి చేశామని మున్సిపల్ ఛైర్మన్ ఏ హరి పేర్కొన్నారు. బుధవారం పుత్తూరు-కార్వేటినగర్ రోడ్డులోని వైఎస్సార్ భవనంలో మున్సిపల్ సాధారణ సమావేశము ఛైర్మన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన సమావేశంలో అజెండా కాపీని చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ అభివద్ధి ఎక్కడ అని పత్రిక ప్రకటనలు ఇవ్వడం సరికాదని, మున్సిపాలిటీలో సిసి రోడ్లు, 14 ఆర్థిక సంఘం ద్వారా కాలువలు, శ్మశాన వాటికల్లో అభివద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం రెడ్డి, వైస్ ఛైర్మన్లు బి జయప్రకాష్, డి శంకర్, కౌన్సిలర్లు, ఆప్షన్ మెంబర్లు, ఏఈ, డిఇ, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న ఛైర్మన్ హరి

In The Court of the IV Addl. Dist. Judge Cum MACT: Tirupati
MVOP: 50/2023
P.Sailaja & another ...Petitioner
V/s
P.Ankaiah & Others ...Respondants
MVOP Notice to Respondant No.2
R2) L.Chenchu Lakshmi W/o L.Koteswara Rao, D.No.16-568, Karana Kamma Street, Venkatagiri Town & Mandal, Tirupati Dist.
Please take notice that the above MVOP stand Posted to 01.09.2023 for your appearance, So Please be Present on that day at 10.30 AM before above said court either personally or through an advocate and file objections if any, failing which you will be decided as an exparty in the above MVOP Proceedings.
Date of Hearing: 01.09.2023
Order by Court
S.Naveen Kumar, Advocate,
TIRUPATI. Cell: 9440876497